భారత రాజ్యాంగం గొప్పది

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: భారత రాజ్యాంగం చాలా గొప్పదని ఆ రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని జీహెచ్ఎంసీ ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వజ్రోత్సవం సందర్భంగా రాంనగర్, నల్లకుంట డివిజన్ల జోన్ స్థాయి హైస్కూల్ విద్యార్థులకు, పాటలు, డ్రాయింగ్ తదితర పోటీలను నిర్వహించారు. పిల్లల్లో దేశభక్తిని పెంపొందించడానికి కృషి చేయాలని హేమలత అన్నారు. ప్రముఖ సామాజికవేత్త నిమ్మల రాజశేఖర్ మాట్లాడుతూ... విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి హైదరాబాద్ జిందాబాద్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. పోటీలో గెలుపొందిన విజేతలకు ఫిబ్రవరి 2న రవీంద్రభారతిలో జరిగే కల్చరల్ ఫెస్ట్‌లో బహుమతులు ప్రదానం చేస్తామని హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి వీరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో భవాని శంకర్, నాగేశ్వర్‌రావు, శ్రీనివాసరావు, మోహన్‌నాయుడు, సంగీత, సైదులు, మేఘన తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

చిక్కడపల్లి: సాంస్కృతిక సంస్థ సాయి సంగీత లహరి ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో బుధవారం రాత్రి నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. గాయనీ గాయకులు చిత్ర గీతాలను మధురంగా ఆలపించారు. ఈ సందర్భంగా గాయనీగాయకులు ఎ.రామప్రసాద్, శ్రీదేవిలను ఘనంగా సన్మానించారు. ఈ రామ్‌రాజ్, నాగమణి, రాధారాణి, సరోజ, విజయలక్ష్మి, జయశీల్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుల్లో వసతులు కల్పిస్తాం

నల్లకుంట: అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని పార్కుల్లో సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చెప్పారు. బుధవారం న్యూనల్లకుంట నరేంద్ర పార్కులో రూ.5లక్షల వ్యయంతో నూతనంగా ఏరాటు చేస్తున్న బోర్‌వెల్ పనులకు ఆయన స్థానిక శంకుస్థాపన చేశారు. ఇప్పటికే అన్ని పార్కుల్లో వాకింగ్ ట్రాక్స్, బెంచీలు, పిల్లల ఆట పరికరాలు, ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు చేశామన్నారు. పార్కులో పచ్చదనం కోసం పచ్చిక బయళ్లు, పూల మొక్కలు నాటించామని తెలిపారు.

రాజ్యాధికారంతోనే బహుజనులకు న్యాయం

కాచిగూడ: సమాజంలో గుడి, బడి, వీధుల్లో, గ్రామాల్లో బహుజనులు ఒకప్పుడు అవమానాలకు గురయ్యేవారని... ఇప్పుడు అగ్రకుల పార్టీలు, ప్రభుత్వాలు, అధికారుల ద్వారా అడుగడుగునా బహుజనులు అవమానాలకు గురువుతున్నారని ఎస్‌పీజేఎఫ్ చైర్మన్ వీజీఆర్ నారగోని అన్నారు. బుధవారం నారాయణగూడలో జరిగిన 'అవమానాల సభ'లో ఆయన మాట్లాడారు. అవమానాలు భరిస్తూ బతుకుతున్న బహుజనులను ఏకం చేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాజ్యాధికారం ద్వారానే బహుజనులకు న్యాయం జరుగుతుందన్నారు. ఆ దిశగా బహుజనులు రాజ్యాధికారం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

టీజీసీడీపీఏ ఫైనాన్స్ సెక్రటరీగా డాక్టర్ ప్రభు

ముషీరాబాద్: విద్యానగర్‌లోని వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.ప్రభు తెలంగాణ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్స్ అసోసియేషన్ నుంచి ఫైనాన్స్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.ప్రభు మాట్లాడుతూ.. తెలంగాణలో 149 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయని ఇవి రాష్ట్రంలో నాణ్యమైన ఉన్నత విద్యను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్, ఆర్.లావణ్య, టీజీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బ్రిజేష్, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.పద్మజ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సంవిధాన్ గౌరవ్ అభియాన్

చిక్కడపల్లి: సంవిధాన్ గౌరవ్ అభియాన్‌లో భాగంగా బుధవారం డివిజన్‌లోని వీవీగిరి నగర్, వాల్మీకినగర్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగం ప్రకారం ఆర్టికల్ 370, త్రిపుల్ తలాక్ వంటి ప్రతిష్టాత్మక నిర్ణయాలను తీసుకుందన్నారు. భారత రాజ్యాంగాన్ని బీజేపీ గౌరవిస్తుంది.. గౌరవిస్తూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో రత్నసాయిండ్, నేతలు శ్రీకాంత్, దామోదర్, సురేష్, సురేందర్, శ్రీనివాస్, నీరజ్ పాల్గొన్నారు.

నేతికార్ సురేష్‌లాల్‌కు సత్కారం

కాచిగూడ: రవాణారంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా తనవంతు కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర రీజినల్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ మెంబర్ నేతికార్ సురేష్ లాల్ తెలిపారు. బుధవారం నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ భవన్‌లో ట్రాన్స్‌పోర్టు అథారిటీ మెంబర్‌గా నూతనంగా నియమితులైన సందర్భంగా నేతికార్ సురేష్‌లాల్‌ను ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘాల నేతలు ఘనంగా సత్కరించి అభినందించారు.

కమ్యూనిటీ హాల్.. సౌకర్యాలు నిల్!


మినీ హైమాస్ట్ స్తంభానికి బిగించని లైట్లు


పగిలిపోయిన కిటికీ అద్దాలు

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని జీహెచ్ఎంసీ కమ్యూనిటీహాల్‌లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. వివాహాలు, శుభ కార్యాయాలు చేసుకోవడానికి 35 ఏళ్ల క్రితం నిర్మించారు. ఈ కమ్యూనిటీహాల్‌ను గృహ నిర్మాణశాఖ మంత్రి శ్రీపతి రాజేశ్వర్‌రావు, మున్సిపల్ కమిషనర్ హెచ్ఎస్ బ్రహ్మం, అప్పటి జవహర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ముఠాగోపాల్ 18–5–1989లో ప్రారంభించారు. ఈ కమ్యూనిటీహాల్ అభివృద్ధికి ఎంపీ అల్లాడి రాజ్‌కుమార్, ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే నాయిని నర్సింహారెడ్డి, అప్పటి రైల్వేశాఖ సహాయమంత్రి బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్యే డాక్టర్ కె.లక్ష్మణ్, మాజీ కార్పొరేటర్ శైలజ గోపాల్, మేయర్ తీగల కృష్ణారెడ్డి అభివృద్ధికి దోహదం చేశారు.

◆ ఈ కమ్యూనిటీహాల్ నిర్మించినప్పటి నుంచి ఏదో ఒక అసౌకర్యం వల్ల కార్యక్రమాలు నిర్వహించుకునే వారు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు నిర్మించారు. సౌకర్యాల మాట మాత్రం మరచిపోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మొదటి అంతస్తులో కరెంట్ లేదు, వైరింగ్ వ్యవస్థ పూర్తిగా పాడవడంతో ఒక్క లైటు కూడా వెలగడం లేదు. వైరింగ్ వ్యవస్థ మార్చాలి. కమ్యూనిటీహాల్‌కు రెండు పవర్‌బోర్డు ఉన్నాయి. అవి పాడైపోయి చాలా రోజులైంది. వాటికి మరమ్మత్తులు చేయించే వారే కరువయ్యారు.

కిరాయిలు వసూలు చేస్తున్నా మెయింటనెన్స్ సున్నా..

◆ సమావేశాలు నిర్వహించేందుకు కమ్యూనిటీ హాల్ రోజుకు కిరాయి.రూ.20వేలు అదనంగా 18 శాతం జీఎస్టీ కలిపి రూ.25వేలు వసూలు చేస్తున్నా మెయింటనెన్స్ చేయడం లేదని ఆరోపణలు చేస్తున్నారు. వివాహాల సందర్భంలో వధూవరులు దుస్తులు మార్చుకోవడానికి కూడా సౌకర్యాలు లేని పరిస్థితి ఉంది. బాత్‌రూమ్‌లు పాడైపోయాయి. కమ్యూనిటీహాల్ మెయిన్ గేట్‌కు కనీసం తాళం కూడా లేదు. కమ్యూనిటీహాల్ నిర్వహణను తమకు అప్పగిస్తే మరమ్మతులు చేసి, శుభ కార్యాలకు అద్దెకు ఇస్తూ మున్సిపల్ శాఖకు ఆదాయం సమకూరుస్తామని ఎస్ఆర్‌టీ జవహర్‌నగర్ పరిరక్షణ కమిటీ సభ్యులు అంటున్నారు.

అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావాలి..

◆ అబిడ్స్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో కిరాయిని రోజుకు చెప్పున రూ.20వేల కాగా 18 శాతం జీఎస్టీతో కలిపి రూ.25వేలు చెక్, లేదా ఆన్ ద్వారా చెల్లిస్తారు. ఇంకా అదనంగా రూ.850 వాటర్ ట్యాంక్, క్లినింగ్‌కు రూ.500, రూ.500 బాత్‌రూం క్లినింగ్ మొత్తం రూ.26,850 అవుతుంది. అయితే 200స్కేర్ యార్డ్స్‌కు రూ.10వేలు జీఎస్టీ రూ.5 వేలు, 15వేలు, 200నుంచి 400యార్డ్స్‌కు రూ.15 వేలు జీఎస్టీ రూ.5వేలు వరకు చెల్లించాల్సి ఉంటుంది. టైమింగ్స్ ఫస్ట్ షిఫ్ట్ ఉదయం 7గంటల నుంచి 4గంటల వరకు, రెండో షిఫ్ట్ సాయంత్రం 4.30 నుంచి రాత్రి 11.30 వరకు ఫంక్షన్లు చేసుకోవచ్చని జీహెచ్ఎంసీ అనుమతులు ఇచ్చింది. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ పావని చర్యలు తీసుకుని అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధి చేయాలి



జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌ను అభివృద్ధి చేసి పేదలు, మధ్యతరగతి ప్రజలు శుభకార్యాలు చేసుకోవడానికి అందుబాటులోకి తేవాలి. మౌలిక సదుపాయాలు కల్పించి అద్దెకు ఇస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. పవర్ బోర్డు వేసి పరిశుభ్రంగా ఉంచాలి.

– ఎన్.శ్రీహరి, ఎస్ఆర్‌టీ కాలనీ

హాల్‌లో వైరింగ్ సెట్ చేయాలి..



జవహహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో కొన్ని నెలల నుంచి విద్యుత్ వైరింగ్ పాడయ్యింది. లైట్లు సక్రమంగా రావడం లేదు. కమ్యూనిటీహాల్‌లో చుట్టు వీధి లైట్లు వెలగడం లేదు. మినీ హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు స్తంభం వేసి 3నెలలైనా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని అన్నారు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యను పరిష్కరించాలి.

– మీసాల రాజేష్, జవహర్‌నగర్ స్థానికుడు

సుందరంగా తీర్చిదిద్దుతాం



జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌ను సమస్యలు పరిష్కరించి సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా. వైరింగ్ బాగు చేయిస్తాం. కరోనా సమయంలో దీనిని కరోనా బాధితులకు ఆసుపత్రిగా, షెల్టర్‌గా ఉంచి ఆదుకున్నాం. కమ్యూనిటీహాల్ సమస్యలు తీర్చేందుకు నిరంతరం శ్రమిస్తా. పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– పావని, గాంధీనగర్ కార్పొరేటర్

సమస్య పరిష్కారానికి కృషి చేస్తా



మూడున్నర దశబ్దాలుగా తనకు ఈ జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ సమస్యలు తెలుసు. దీనిని మున్సిపల్ కార్యాలయంగా మారుస్తామంటే స్థానికులు, ప్రజాప్రతినిధులు కలసి కమ్యూనిటీహాల్‌గా ఉండాలని ప్రతిపాదించారన్నారు. ఈ కమ్యూనిటీహాల్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు సమష్టిగా కృషి చేస్తా. వాచ్‌మెన్ ఉంటే దీనికి రక్షగా ఉంటాడు. విద్యుత్, పవర్ బోర్డు, వైర్లు సమస్యలను పరిష్కారించేందుకు కృషి చేస్తా.

– ముఠాగోపాల్ ఎమ్మెల్యే ముషీరాబాద్

విఖ్యాత నటుడు 'అక్కినేని'కి స్వర నివాళి



చిక్కడపల్లి: విఖ్యాత నటుడు డా. అక్కినేని నాగేశ్వరరావుకు నివాళిగా ప్రముఖ సాంస్కృతిక సంస్థ అర్చన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో 'చూపులు కలసిన శుభవేళ'శీర్షికన బుధవారం స్వర నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కినేని నటించిన చిత్రాలలోని పాటలను మధురంగా గానం చేశారు. అర్చన వెంకటేశ్వర్‌రావు, సహగాయని లలితతో పాటు పాడిన ఘంటసాల సుశీల యుగళ గీతాలు శ్రోతలను ముగ్ధులను చేశాయి. శేఖరుడు నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో రమణి, దమయంతి, శారద, చింతలపాటి మూర్తి, శేఖర్ కూడా తమ గానంతో ఆకట్టుకున్నారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ అధికారి వి.సతీష్ పాల్గొని గాయని గాయకులను అభినందించారు. వై.ప్రకాశరావు అధ్యక్షత వహించిన సభలో గానసభ అధ్యక్షుడు కళాజనార్దనామూర్తి శుభాకాంక్షలు తెలిపారు.

కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యం అందించాలి

డాక్టర్ కొండ దేవయ్య


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కొండ దేవయ్య, ఆర్‌వీ మహేందర్‌కుమార్

కాచిగూడ: దేశ వ్యాప్తంగా, తెలంగాణ రాష్ట్రంలోనూ పేదలకు అందిస్తున్న ఉచిత పథకాలను రద్దు చేసి కార్పొరేట్ స్థాయిలో విద్య, వైద్యం ఉచితంగా అందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలని తెలంగాణ బీసీ సాధికారత సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ డిమాండ్ చేశారు. బుధవారం బర్కత్‌పురలోని బీసీ సాధికారత కార్యాలయంలో సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్.వి.మహేందర్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేవీఆర్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత పథకాల పేరుతో పేద ప్రజలను మభ్యపెడుతూ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నాయే తప్ప ఈ పథకాలతో పేదల అభివృద్ధి ఏ మాత్రం జరగడం లేదన్నారు. ఉచిత పథకాల్లో అవినీతి పెరిగిపోతోందని దీంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతోందన్నారు. పేదల అభివృద్ధి జరగాలంటే ఉచిత పథకాలు కాదని, కార్పొరేట్ స్థాయిలో విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కావాలన్నారు. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. మూసీనదికి లక్ష కోట్లు ఖర్చు పెట్టినా పేదవాళ్లకు ఏ మాత్రం ఉపయోగపడదన్నారు. పేదలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడితే పదికాలాల పాటు ప్రజల్లో స్థిర స్థాయిగా నిలిచిపోతారని అన్నారు.

రూ.15లక్షలతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కాచిగూడ: వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ అంతరాయం కలగకుండా ఉండేందుకు చెప్పల్‌బజార్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ ఉమారాణి బుధవారం విద్యుత్ ఏఈ అంజన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. రూ.15లక్షల వ్యయంతో ఏర్పాటు చేసినట్లు కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు రమేష్‌యాదవ్, బాబన్న, భీమ్‌రాజ్, సంతోష్, కిషోర్, నందు, సూరి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆరోగ్య మిత్రలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ రాజీవ్ ఆరోగ్యశ్రీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మంత్రి హామీ ప్రకారం డేటా ఎంట్రీ ఆఫీసర్ కేడర్‌ను మార్చి జీతాలను పెంచాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. అయినా అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల రాష్ట్రంలోని సుమారు వేయి మంది ఆరోగ్య మిత్రలు తీవ్ర నిరాశకు గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌లోని ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని త్వరితగతిన తమ కేడర్‌ను మార్పు చేయాలని కోరారు. లేకుంటే భవిష్యత్‌లో మరోసారి ట్రస్ట్‌ను ముట్టడించడంతో పాటు తమ విధులను బహిష్కరించి నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పుగూడ – ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (60) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

ముషీరాబాద్: ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ముషీరాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం జార్ఖండ్‌కు చెందిన గుడ్డు కుమార్, సంతుకుమార్ దోమలగూడలోని ఎన్టీఆర్ స్టేడియం వద్ద గంజాయి విక్రయిస్తుండగా వారిని పట్టుకున్నామని తెలిపారు. ఆరు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ఆటో, సెల్‌ఫోన్లు సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

కార్పొరేటర్ పాదయాత్ర

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి బుధవారం డివిజన్‌లోని కృష్ణానగర్, ఎస్ఆర్‌టీ పార్కు తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల వేసిన కొత్త రోడ్డును ఆయన పరిశీలించారు. లక్ష్మీనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ నేత సురేష్‌యాదవ్ మృతి


నివాళులర్పిస్తున్న డా. ఎన్.గౌతంరావు

అంబర్‌పేట: బీజేపీ సీనియర్ నేత కొత్తిమీర్ సురేష్ యాదవ్ (74) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. అంబర్‌పేట సీపీఎల్ రోడ్డు తిరుమలనగర్‌లో ఆయన నివాసం వద్ద కొత్తిమీర్ సురేష్‌యాదవ్ పార్థివదేహానికి బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, కన్నె రమేష్ యాదవ్ తదితరులు నివాళులర్పించారు. సుదీర్ఘకాలం టీడీపీలో కొనసాగిన ఆయన నింబోలిఅడ్డ డివిజన్ నుంచి పార్టీ కార్పొరేటర్ అభ్యర్థిగా కూడా పోటీ చేశారు. కొన్నేళ్ల క్రితం బీజేపీలో చేరారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు.

నక్సలైట్లను అంతం చేస్తామనడం దారుణం

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క


బండ్రు నర్సింహులు దంపతులకు నివాళులర్పిస్తున్న విమలక్క తదితరులు

సుందరయ్య విజ్ఞానకేంద్రం: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా 2026 కల్లా నక్సలైట్లను అంతం చేస్తామని ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో తెలంగాణ సాయుధ పోరాట యోధులు, సీపీఐఎంఎల్ జనశక్తి సీనియర్ నాయకులు, ప్రజావిమోచన పూర్వ సంపాదకులు బండ్రు నర్సింహులు 3వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ.. మహత్తర తెలంగాణ సాయుధ పోరాటంలో బండ్రు నర్సింహులు చేసిన కృషి మరవలేనిదన్నారు. విప్లవోద్యమంపై విషం చిమ్ముతూ దండకారణ్యంలో కేంద్రం నెత్తుటేర్లు పారిస్తోందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో అరుణోదయ అధ్యక్షుడు ఏపూరి మల్సూర్, ప్రధాన కార్యదర్శి రమేష్ పోతుల, కార్యదర్శి రాకేష్ పాల్గొన్నారు.

బీసీలు మరో జాతీయ సమరానికి సిద్ధం కావాలి

జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి



కాచిగూడ: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం బీసీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. బీసీలు న్యాయమైన హక్కులు సాధించుకోవడానికి జాతీయ స్థాయిలో మరో స్వాతంత్ర్య సమరానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న దేశ జనగణనలో కులాల వారి లెక్కలు తీయాలని డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలలో 50శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. బీసీల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 50శాతానికి పెంపు, బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించేలా రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలన్నారు.

◆ బీసీలకు పారిశ్రామిక పాలసీలో 50 శాతం కోటా కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి రూ.2లక్షల కోట్లతో ప్రత్యేక అభివృద్ధి పథకం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, అయ్యన్న, మల్లేశం, రణధీర్, సాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషకు గిడుగు చేసిన కృషి మరువలేనిది

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డా. రాధారాణి


గిడుగు జాతీయ పురస్కారాల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న జస్టిస్ రాధారాణి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలుగు భాష అభ్యున్నతికి గిడుగు రామమూర్తి పంతులు చేసిన కృషి మరువలేనిదని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ జి. రాధారాణి అన్నారు. గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్, శంకరం వేదిక సంయుక్త ఆధ్వర్యంలో గిడుగు జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. వివిధ రంగాలలో సేవలు అందించిన ప్రముఖులను గిడుగు జాతీయ పురస్కారాలతో సత్కరించారు. అనంతరం జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ... మాతృభాషను అమితంగా ప్రేమించి రచనలను విస్తృతం చేయాలని కోరారు. కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కరంనేని రవిశంకర్, డాక్టర్ పి. విజయలక్ష్మి పండిట్, వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ వర్లు, సినీ రచయిత దివాకర్ బాబు, పరిశోధకులు భగీరథ, విక్రమ్ పూల, కస్తూరి శ్రీనివాస్, డాక్టర్ పి. సునందాబాయి, వినాయకరావు, వీరుకొండ హనుమంతరావు, కేఎస్ రామచంద్ర నాయక్, డాక్టర్ ముక్తేరి భారతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన


అంబేడ్కర్ కళాశాలలో జరిగిన ఎన్‌సీసీ డేలో డాక్టర్ విష్ణుప్రియ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఎన్‌సీసీలో చేరడం వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ పెరుగుతుందని అంబేడ్కర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విష్ణుప్రియ అన్నారు. ఇలాంటి ఉత్తమమైన అవకాశాన్ని ప్రతి విద్యార్థి అందిపుచ్చుకోవాలని సూచించారు. బుధవారం కళాశాలలో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ఎన్‌సీసీ డేను ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ విద్యార్థులకు ర్యాంకింగ్ ప్రమోషన్స్ ఇచ్చిన అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్‌సీసీ ప్రదర్శన ఆకట్టుకునేలా సాగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విష్ణుప్రియ మాట్లాడుతూ... ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు దేశానికి సేవ చేసే లక్షణాలు అలవడుతాయని అన్నారు. నాయకత్వ లక్షణాలతో పాటు మంచి వ్యక్తిత్వ వికాసాన్ని అలవర్చుకోగలుగుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్టా శేఖర్, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ ఎం. కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

డా.అచ్యుతాదేవికి జాతీయ ఐక్యత అవార్డు



కాచిగూడ: విద్యాభివృద్ధికి 32 సంవత్సరాలుగా కృషి చేస్తున్న నారాయణగూడలోని రెడ్డి మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.అచ్యుతాదేవిని జాతీయ ఐక్యత అవార్డు–2025కి ఎంపిక చేసినట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డా. రాజ్‌నారాయణ ముదిరాజ్ తెలిపారు. స్వామి వివేకానంద జయంతి ముగింపు ఉత్సవాలను పురస్కరించుకొని ఈనెల 23వ తేదీన గురువారం నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగారం, అతిథులుగా రిటైర్డ్ జడ్జి జస్టిస్ పీఎస్ నారాయణ, సినీ నటుడు డాక్టర్ పృథ్వీరాజ్, డాక్టర్ ఎస్.బాలాచారి, డాక్టర్ లయన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, లయన్ ప్రేమ్‌చంద్ మునోత్ జైన్ పాల్గొంటారని తెలిపారు.

సేవా భావం..

ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకొని పేదలను ఆదుకోవాలని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని బ్రహ్మంగారి దేవాలయం వీధిలో క్రిస్మస్ ఫీస్ట్ వేడుకలను బుధవారం బీఆర్ఎస్ నాయకులు కృపావరం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ముఠా జైసింహ మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని అన్నారు. ఆయన బోధన వల్లే ప్రతి ఒక్కరూ శాంతి, దయా, క్షమాపణ గుణం కలిగి ఉండాలని సూచించారు. వృద్ధాప్యంలో ఉన్న పెద్దలను చీదరించుకోకుండా వారికి అన్ని విధాల ఆదుకోవాలన్నారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా ప్రేయర్ పవర్ చర్చ్‌స్ డైరెక్టర్ శ్యామ్ అబ్రహం, పాస్టర్ ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


బ్రహ్మంగారి వీధిలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న ముఠా జైసింహ